సాక్షి విశాఖపట్నం


బుధవారం । 19 । మార్చి । 2025



వేయి కనులు చాలవులే.. 8లో



కైలాసగిరిపై భద్రత ప్రశ్నార్థకం 8లో



ఇఫ్తార్	సహర్
బుధ	గురు
6.09	4.49

రంజాన్ వేళలు

కూటమి కుతంత్రం



మేయర్ పీఠం కోసం కుయుక్తులు

- రంగంలోకి దిగిన ఎంపీలు, ఎమ్మెల్యేలు
- కార్పొరేటర్‌కు రూ.25 లక్షల చొప్పున బేరం
- ససేమిరా అంటున్న వారికి ఎక్కువ ఆఫర్లు
- లొంగని వారికి బెదిరింపులు

డాబాగార్డెన్స్ : విశాఖలో కూటమి కుట్రలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఎలాగైనా మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలనే దుర్బుద్ధితో తెర వెనుక అప్రజాస్వామిక ప్రయత్నాలు సాగిస్తున్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు అవసరమైన సంఖ్యా బలాన్ని కూడగట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా వైఎస్సార్ సీపీకి చెందిన కార్పొరేటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు కోట్లాది రూపాయలు సిద్ధం చేశారు. ఒక్కొక్క కార్పొరేటర్‌కు ఏకంగా రూ.25 లక్షలు వెలకట్టి, వారిని కొనుగోలు చేసేందుకు తెగబడినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో కూటమికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు సైతం నేరుగా రంగంలోకి దిగడం గమనార్హం. కొందరికి భారీ మొత్తంలో డబ్బు ఆఫర్ చేస్తూ, మరికొందరి వ్యాపారాలను అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఎవరైనా లొంగకపోతే వారి ఆస్తులను ధ్వంసం చేస్తామని బహిరంగంగానే హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ ఇదే తరహా అప్రజాస్వామిక విధానాలను అవలంబించి స్థానిక సంస్థలను చేజిక్కించుకున్న కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు విశాఖ నగర పీఠాన్ని కూడా తమ గుప్పిట్లో పెట్టుకోవాలని కుట్రలు పన్నుతోంది.

గ్రేటర్‌లో బలం లేకపోయినా..

గ్రేటర్‌లో కూటమికి సంఖ్యా బలం లేదు. మహా విశాఖ నగరపాలక సంస్థలోని 98 వార్డులకు కార్పొరేటర్లు ఎన్నికయ్యారు. ప్రస్తుతం 19వ వార్డు మినహాయిస్తే 97 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వైఎస్సార్ సీపీ 58, తెలుగుదేశం 29, జనసేన 3, సీపీఐ, సీపీఎం, భాజపాకు ఒక్కొక్కరు, నలుగురు స్వతంత్ర కార్పొరేటర్లు గెలుపొందారు. అయినప్పటికీ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను నయానో భయానో తమకు మద్దతు తెలిపేలా స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రలోభాలు, బెదిరింపులకు దిగుతున్నారు. ఇందుకోసం అవసరమైతే క్యాంపు రాజకీయాలకు కూడా సిద్ధమవుతున్నారు. కూటమిలో చేరితే రూ.25 లక్షలు ఇస్తామని ఎర వేస్తున్నట్టు తెలిసింది. అక్కడికీ లొంగకపోతే మరింత ఎక్కువ ఇస్తామని నమ్మబలుకుతున్నారు. వార్డుల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేయిస్తాం.. వచ్చే ఎన్నికల్లో సీటు మీదే.. ఇలా పలు విధాలుగా లొంగదీసుకునేందుకు శత విధాల ప్రయత్నాలు చేస్తున్నారు.

కమిషనర్‌నే నియమించుకోలేయపోయారు

కూటమి ప్రభుత్వం దాదాపు రెండు నెలలుగా జీవీఎంసీ కమిషనర్‌ను నియమించకుండా పాలనను గాలికి వదిలేసిందని నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 10న వామపక్షాలు జీవీఎంసీలో పాలన పూర్తిగా గాడి తప్పిందని నిరసన తెలిపారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పూర్తి స్థాయి కమిషనర్ లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడి, అధికారులు సైతం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలకు కనీస సౌకర్యాలు అందడం లేదు. పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. దోమల బెడదతో నగర ప్రజలు రోగాల బారిన పడుతుంటే పట్టించుకునే నాథుడే లేడు. ఎండాకాలం కావడంతో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉన్నా.. వార్డుల అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయినా కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదు. కనీసం కమిషనర్‌ను నియమించలేని అసమర్థ ప్రభుత్వం.. కుట్రలు చేసి అధికారం దక్కించుకోవాలని చూడటం సిగ్గుచేటని మండిపడుతున్నారు. కూటమి నేతలు కుట్రలను మానుకొని పాలనపై దృష్టి సారించాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అంతు చూస్తామంటూ బెదిరింపులు

కూటమి నేతల ఆఫర్లకు తలొగ్గని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లపై బెదిరింపులకు దిగుతున్నారు. మద్దతు తెలపని కార్పొరేటర్లను 'మీ అంతు చూస్తాం'అంటూ కూటమి నేతలు హెచ్చరిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా వార్డుల్లో అభివృద్ధి పనులు జరగనివ్వబోమని, వ్యాపారాలు, ఇతర పనులు సాఫీగా సాగనివ్వబోమని బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. 'రాష్ట్రంలో మా ప్రభుత్వమే ఉంది. మా నాయకుడు ఇప్పటికే వైఎస్సార్ సీపీకి ఎటువంటి పనులు చేయకూడదని ఆదేశాలు జారీ చేశారు.' అంటూ కూటమి నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారని పలువురు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పార్టీకి ద్రోహం చేయలేను

'నాకు వైఎస్సార్ సీపీ రాజకీయ భిక్ష పెట్టింది. పార్టీకి ద్రోహం చేయలేను. ఇప్పటికే జనసేన, టీడీపీల నుంచి నాకు ఫోన్లు వచ్చాయి. వాళ్లు ఎన్నో ప్రలోభాలు పెట్టారు. వచ్చే ఎన్నికల్లో కార్పొరేటర్ అభ్యర్థిగా నువ్వే ఉంటావని హామీ ఇచ్చారు. నా వార్డు అభివృద్ధికి మరింత సహకారం అందిస్తామని చెప్పారు. వార్డులో జనసేన, టీడీపీ కార్యకర్తలు నీ వెంటే ఉంటారని తెలిపారు. అంతేకాదు నాకు మరిన్ని పదవులు ఇస్తామని ఎన్నో వాగ్దానాలు చేశారు. డబ్బు కూడా ఇస్తామన్నారు.' అంటూ ఓ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఆవేదన వ్యక్తం చేశారు.

కుట్రలకు కేరాఫ్ చంద్రబాబు

వెన్నుపోటు రాజకీయాలు.. అరాచక పాలన

- తమ కార్పొరేటర్లకు అధికారులతో ఫోన్ చేయించి బెదిరిస్తున్నారు
- ప్రలోభాలతో సిగ్గు లేని రాజకీయాలకు తెరతీస్తున్నారు..
- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు
- బెదిరింపులు సహించం: మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కన్నబాబు, జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం : చంద్రబాబు రాజకీయమంతా కుట్రలు, కుతంత్రాలేనని.. తమ పార్టీకి చెందిన కార్పొరేటర్లకు అధికారులతో ఫోన్లు చేయించి బెదిరింపులకు పాల్పడుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, ముఖ్యనాయకులు, సమన్వయకర్తలతో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాస్‌తో కలిసి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి పార్టీలకు బలం లేకున్నా మేయర్‌పై అవిశ్వాసం పెట్టడానికి కుయుక్తులు పన్నుతున్నారని మండిపడ్డారు. తమ పార్టీలోని కొంతమంది కార్పొరేటర్లను టీడీపీలోకి చేర్చుకునేందుకు బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఎవరెన్ని బెదిరింపులకు పాల్పడినా వైఎస్సార్ సీపీ అంటే అభిమానంతో ఉన్న కార్పొరేటర్లు భయపడేది లేదని, మేయర్ పీఠాన్ని తప్పకుండా కాపాడుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

స్టీల్‌ప్లాంట్‌పై కూటమి ప్రభుత్వం దగా

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దగా మరోసారి బయట పడిందని ఆయన అన్నారు. ప్యాకేజ్ ఇచ్చాం, ప్రైవేటీకరణ అంశమే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ ప్రకటనలు తప్పని కేంద్ర ఆర్థిక శాఖ అనుబంధంగా ఉండే డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అస్సెట్ మేనేజ్‌మెంట్(దీపం) ఇచ్చిన సమాధానంతో బట్టబయలైందని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపేది లేదని దీపం రాసిన లేఖతో కూటమి నేతల నాటకాలు అందరికీ తెలుస్తున్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ తీసుకొచ్చి ప్రైవేటీకరణను తామే ఆపించామని చెబుతున్న కూటమి నేతలు ఇప్పుడు సమాధానం చెప్పాలన్నారు. కూటమి నేతలు రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారని, రాష్ట్ర సంపదను దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మైనింగ్ మాఫియా రెచ్చిపోతుందన్నారు.

తలొగ్గకుంటే కేసులు పెడతారంట?

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను పార్టీ మారాలని ఒత్తిడి తెస్తున్నారని, తలొగ్గకపోతే కేసులు పెడతామని భయపెడుతున్నారన్నారు. ప్రలోభాలతో తమ పార్టీకి చెందిన ముగ్గురు, నలుగురు కార్పొరేటర్లను చేర్చుకోవాలని చూస్తున్నారని తెలిపారు. ఎవరెన్ని కుయుక్తులు పన్నినా వైఎస్సార్ సీపీ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కార్పొరేటర్లకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రలోభాలను పక్కన పెట్టి పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. తమ కార్పొరేటర్లను బెదిరించాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. అధికారం శాశ్వతం కాదని, భవిష్యత్తులో అసలైన రాజకీయం వారికి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవన్‌రెడ్డి, జీవీఎంసీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సీఐఎస్‌ఎఫ్ సైకిల్ ర్యాలీ ప్రారంభం



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న పోర్ట్ చైర్మన్ అంగముత్తు

ఏయూక్యాంపస్: తీరప్రాంత భద్రత ప్రాధాన్యతను వివరిస్తూ సీఐఎస్ఎఫ్ చేపట్టిన సైకిల్‌థాన్‌ను మంగళవారం ఉదయం విశాఖ పోర్ట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు జెండా ఊపి ప్రారంభించారు. విశ్వప్రియ ఫంక్షన్ హాలు వద్ద ఈ కార్యక్రమం జరిగింది. శ్రీకాకుళం నుంచి సైకిల్‌థాన్ బృందం సోమవారం విశాఖ చేరుకున్న విషయం తెలిసిందే. తిరిగి విశాఖ నుంచి మంగళవారం తమ ప్రయాణాన్ని ప్రారంభించింది. సైకిల్‌థాన్‌కు మద్దతుగా పలువురు చిన్నారులు సైకిళ్లపై సీఐఎస్ఎఫ్ సిబ్బంది వెంట కొంత దూరం ప్రయాణించారు. పీపీఏ సెక్రటరీ టి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

నలుగురు ఎస్‌ఐలకు స్థానచలనం



విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో నలుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆరిలోవ ట్రాఫిక్ ఎస్‌ఐగా ఉన్న ఎస్.శ్రీకాంత్‌ను పద్మనాభం క్రైమ్‌కు, ఆరిలోవ క్రైమ్ స్టేషన్‌కు అటాచ్‌మెంట్‌లో ఉన్న ఎ.మురళీకృష్ణను అదే స్టేషన్ ట్రాఫిక్‌లో పోస్టింగ్ ఇచ్చారు. అలాగే గాజువాక లా అండ్ ఆర్డర్‌లో ఉన్న ఎం.రాధాకృష్ణను భీమిలి లా అండ్ ఆర్డర్‌కు, పీఎం పాలెం లా అండ్ ఆర్డర్‌లో ఉన్న ఎ.మన్మథను టూ టౌన్ లా అండ్ ఆర్డర్‌కు బదిలీ చేశారు.

సీఐపీఈటీ సహకారంతో ఎన్టీపీసీలో ఉపాధికి శిక్షణ



చెక్ అందిస్తున్న ఈడీ సమీర్‌శర్మ

పరవాడ: విజయవాడలోని సీపీఈటీ సహకారంతో సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం కల్పిస్తున్న ఉపాధి శిక్షణ కార్యక్రమాన్ని ఉమ్మడి విశాఖ జిల్లా నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సంస్థ ఈడీ సమీర్‌శర్మ కోరారు. విజయవాడలోని సీపీఈటీని ఈడీ సమీర్‌శర్మ, సంస్థ అధికారులు మంగళవారం సందర్శించారు. శిక్షణ పొందుతున్న నిరుద్యోగులను కలిసి, వారి సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈడీ సమీర్ శర్మ మాట్లాడుతూ సీపీఈటీ సహకారంతో సింహాద్రి ఎన్టీపీసీ శతశాతం ఉద్యోగ నియామక హామీపై మెషీన్ ఆపరేటర్, ప్లాస్టిక్ ప్రాసెసింగ్, మెషీన్ ఆపరేటర్-ఇంజెక్షన్ మోల్డింగ్‌లో ఆరు నెలల శిక్షణ అందిస్తోందన్నారు. ఇప్పటి వరకు నాలుగు బ్యాచ్‌లలో 120 మంది నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించామన్నారు. ప్రస్తుతం మరో 60 మంది నిరుద్యోగులు శిక్షణ పొందుతున్నారని పేర్కొన్నారు.

28న తపాలా అదాలత్

మహారాణిపేట: విశాఖ పోస్టల్ రీజియన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 28న 117వ తపాలా అదాలత్ నిర్వహిస్తున్నారు. ఎంవీపీ కాలనీలోని పోస్టు మాస్టర్ జనరల్ కార్యాలయంలో ఈ అదాలత్ జరుగుతుందని తపాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.వి.డి.సాగర్ తెలిపారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం, విశాఖ, అల్లూరి సీతారామరాజు జిల్లా, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల పరిధిలోని తపాలా వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులను ఈనెల 24లోగా పోస్టు మాస్టర్ జనరల్ కార్యాలయం, విశాఖపట్నం-530017 చిరునామాకు పంపించాలని కోరారు.

దాకమర్రి లే అవుట్‌లో ప్లాట్ల ధరల తగ్గింపు

మహారాణిపేట: విశాఖ-రాయపూర్ జాతీయ రహదారిని అనుకుని, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరువలో సకల సదుపాయాలతో వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన(ఫార్చ్యూన్ హిల్స్)దాకమర్రి లే అవుట్‌లోని నివాస స్థలాల (ప్లాట్లు) ధరలు తగ్గించారు. రాష్ట్ర స్థాయి కమిటీ నిర్ణయించిన మేరకు పురపాలక శాఖ కమిషనర్ డైరెక్టర్ ఆమోదంతో లే అవుట్‌లో చదరపు గజం ఒక్కింటికి రూ.20 వేలు నుంచి రూ.15,500కు తగ్గించినట్లు వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. సామాన్యులకు కూడా నివాస స్థలాలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపకపోతే నిరవధిక సమ్మె



ధర్నాలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికులు

ఉక్కునగరం: కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపకపోతే నిరవధిక సమ్మెకైనా వెనుకాడబోమని ఉక్కు కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని రీజనల్ లేబర్ కమిషనర్ ఆదేశించినా యాజమాన్యం లెక్కచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులను తొలగించడానికి మెడికల్ టెస్టులు బలవంతం చేయడం దుర్మార్గమన్నారు. మరో వెయ్యి మందిని తొలగించడానికి రంగం సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ఇచ్చింది కార్మికులను తొలగించడానికా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకుని కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి కాంట్రాక్ట్ కార్మికులను తొలగించకుండా చూడాలన్నారు. ఈనెల 23న గాజువాక నుంచి కూర్మన్నపాలెం దీక్ష శిబిరం వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్లాంట్ పర్సనల్ జీఎం ఎస్.భానుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, మంత్రి రవి, కె.వంశీ, ఉరుకూటి అప్పారావు, వేణు, ఉమ్మిడి అప్పారావు, రామిరెడ్డి, చట్టి నర్సింగరావు, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ జాతీయ పోటీలకు విశాఖ క్రీడాకారులు



పల్లి శ్రీనివాసులు, పేట ద్రాక్షాయణి

ఎంవీపీకాలనీ: బీహార్‌లో జరగనున్న 34వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు విశాఖ క్రీడాకారులు ఎంపికైనట్లు విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌పీ ప్రసాదరెడ్డి మంళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలోని వైఎస్సార్ ఇంటిగ్రేట్ స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన 34వ రాష్ట్ర సబ్ జూనియర్ బాలురు, బాలికల కబడ్డీ పోటీల్లో విశాఖ క్రీడాకారులు సత్తాచాటారు. బాలుర విభాగంలో పల్లి శ్రీనివాసులు(గాజువాక), బాలికల విభాగంలో పేట ద్రాక్షాయణి(పెందుర్తి) రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. మన రాష్ట్రం తరపున బీహార్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనే బాలురు, బాలికల జట్లకు వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రసాదరెడ్డితో పాటు జాయింట్ సెక్రటరీ సీహెచ్ గోవిందు, కోశాధికారి లక్ష్మణరావు, జాతీయ క్రీడాకారులు వైవీ శ్రీనివాస్, వి.కనకరాజు తదితరులు అభినందించారు.

ఇక వృద్ధులకు ఒంటరితనం దూరం

- టైమ్ బ్యాంక్ కాన్సెప్ట్‌తో ఇది సాధ్యం
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో వివిధ శాఖల అధికారులు

మహారాణిపేట: రాజస్థాన్‌కు చెందిన పి.సి.జైన్, అతని బృందం అభివృద్ధి చేసిన టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాన్సెప్ట్ ద్వారా వయోవృద్ధులకు ఒంటరితనం పోతుందని, అవసరమైన సమయంలో తోడు దొరుకుతుందని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అభిప్రాయపడ్డారు. వయో వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని.. ఇందులో భాగంగానే టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంస్థ సహకారంతో విశాఖను పైలట్ జిల్లాగా ఎంపిక చేసిందన్నారు. టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా-విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పరిషత్ సమీపంలోని ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ భవన్‌లో సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒకప్పుడు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉండటంతో సీనియర్ సిటిజన్లకు ఒంటరితనం అనే భావన ఉండేది కాదన్నారు. ఇప్పుడు పరిస్థితులు మారడం వల్ల వారు ఒంటరిగా మారుతున్నారని, రోజు వారీ అవసరాలు, వారి భావోద్వేగ అవసరాల్లో ఇతరుల తోడు అవసరమవుతుందన్నారు. ఈ టైమ్ బ్యాంక్ భావనతో ఆ పరిస్థితిని మార్చుకోవచ్చని కలెక్టర్ అన్నారు. అనంతరం సంబంధిత బ్రోచర్‌ను కలెక్టర్, వివిధ శాఖల అధికారులు ఆవిష్కరించారు.

ఉచితంగా రిజిస్ట్రేషన్

టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాన్సెప్ట్‌లో భాగంగా 18 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసు ఉన్న వారు www.timebankofindia.com వెబ్‌సైట్‌లో లేదా బ్యాంక్ అనే మొబైల్ యాప్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చని విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ జె.మాధవి చెప్పారు. రిజిస్ట్రేషన్, సేవ, పాస్ బుక్ పొందడం మొదలైనవన్నీ ఉచితంగా లభిస్తాయని తెలిపారు. యువకులు మాత్రమే కాకుండా, సహాయం అందించడానికి అర్హులైన వారందరూ స్వచ్ఛందంగా సేవ చేయవచ్చని, ఆ మేరకు వారి సమయం వారి పాస్ పుస్తకాల్లో జమ అవుతుందని వివరించారు. వారికి అవసరమైనప్పుడు ఇతరుల నుంచి సహాయం పొందవచ్చని పేర్కొన్నారు. నమోదిత సభ్యులను స్థానిక నిర్వాహకుల ద్వారా వారి కేవైసీ ధ్రువీకరిస్తామని.. పోలీస్ వెరిఫికేషన్‌కు కూడా పంపిస్తామని స్పష్టం చేశారు. పైలట్ జిల్లాగా ఎంపికైన విశాఖపట్నంలో ఈ కాన్సెప్ట్ అమలుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో భాగంగా టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంస్థ ప్రతినిధులు కలెక్టర్, ఇతర అధికారులను సత్కరించారు. క్రైం డీసీపీ రాజ్ కమల్, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు, వి.ఎస్.కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ఎంఎస్‌ఎంఈల సాధికారతపై సదస్సు

మహారాణిపేట: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ) సాధికారత దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 19న నోవోటెల్ హోటల్‌లో సీఐఐ సహకారంతో ఏపీ ఎంఎస్‌ఎంఈ అభివృద్ధి కార్పొరేషన్, నీతి ఆయోగ్ సంయుక్తంగా 'ఎగుమతి ఆధారిత వృద్ధి-ఆవిష్కరణల కోసం ఎంఎస్‌ఎంఈలను సాధికారపరచడం' అనే అంశంపై ప్రత్యేక వర్క్ షాప్ నిర్వహించనుంది. ఈ మేరకు స్థానిక అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేస్తూ ఎంఎస్‌ఎంఈ సీఈవో లేఖ రాశారు. వర్క్‌షాప్‌లో మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ కార్యదర్శి (పరిశ్రమలు, వాణిజ్యం) ఎన్.యువరాజ్, ఇతర ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, సుమారు 250-300 మంది ఎంఎస్‌ఎంఈ వ్యవస్థాపకులు, ఔత్సాహికులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సబ్బవరంలో భారీగా గంజాయి స్వాధీనం

- ఏవోబీ నుంచి మహారాష్ట్రకు కారులో తరలిస్తుండగా పట్టివేత
- రూ.18.19 లక్షల విలువైన 363.8 కిలోల గంజాయి స్వాధీనం
- 2 కార్లు, ఐదు మొబైళ్లు, రూ.50 వేలు నగదు సీజ్
- ఏడుగురి అరెస్ట్, ముగ్గురు పరారీ



పట్టుబడిన గంజాయి, కార్లు, నిందితులతో డీఎస్పీ విష్ణు స్వరూప్, సబ్బవరం పోలీసులు

సబ్బవరం: మండలంలోని ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారిపై బాటజంగాలపాలెం టోల్ గేట్ వద్ద కారులో పెద్ద ఎత్తున తరలిస్తున్న గంజాయిని సబ్బవరం పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ పిన్నింటి రమణతో కలిసి డీఎస్పీ వశ్లెం విష్ణుస్వరూప్ మీడియాకు వివరాలు వెల్లడించారు.

ఆంధ్ర-ఒడిశా బోర్డర్‌లో ఏజెన్సీ ప్రాంతం నుంచి మహరాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న రూ.18.19 లక్షల విలువ చేసే 363.8 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సీఐ పిన్నింటి రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ సింహాచలం తన సిబ్బందితో కలిసి గంజాయి తరలిస్తున్న కారుతో పాటు పైలెట్ వాహనంగా వస్తున్న మరో కారును తనిఖీ చేసి, గంజాయిని పట్టుకున్నారు. రెండు కార్లను సీజ్ చేశారు. 7గురిని అదుపులోకి తీసుకోగా, మరో ముగ్గురు పరారయ్యారైనట్లు తెలిపారు. వారి నుంచి రూ.50 వేలు నగదు, 5 సెల్‌ఫోన్లతో కలిపి ఈ కేసులో మొత్తం రూ.57.10 లక్షల సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

ఏవోబీ బోర్డర్‌లో కొనుగోలుచేసి చింతపల్లిలో లోడ్‌చేసి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. గంజాయి తరలింపులో వినియోగించిన వాహనాలు తప్పుడు రిజిస్ట్రేషన్ నంబర్లతో ఉన్నాయని, వీటిపై దర్యాప్తు చేయాల్సి ఉందన్నారు. పట్టుబడిన వ్యక్తుల్లో ఏఎస్ఆర్ జిల్లాకు చెందిన వారు ఆరుగురు, ఒడిశాకు చెందిన వ్యక్తి ఒకరు ఉన్నారు. ఏ1గా సామిరెడ్డి విజయ్(31), ఏ2 వంతల హరీష్‌బాబు(30), ఏ3 మాడబత్తుల అరుణ్‌కుమార్(38), ఏ4 సాగర్ శివాజీ గోపసీ(32), ఏ5 కొర్రా మహేష్‌బాబు(32), ఏ6 ఎన్.రమణ(40), ఏ7గా సరమంద అనిల్‌కుమార్(25)లపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ పిన్నింటి రమణ, ఎస్‌ఐలు సింహాచలం, టి.దివ్య తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలు

ఏయూ క్యాంపస్: నగరంలో వ్యర్థాల సమర్థ నిర్వహణలో భాగంగా రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్(ఆర్‌ఆర్‌ఆర్) కేంద్రాలు త్వరలో ఏర్పాటు కానున్నాయి. జీవీఎంసీతో స్క్రాప్ క్యూ సంస్థ కలసి పని చేయనుంది. ఏప్రిల్ 1 నుంచి నగరంలో ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు స్క్రాప్ క్యూ సంస్థ ప్రతినిధి ఎస్.వెంకట తులసీరాం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ పట్ల మరింత బాధ్యతగా నిలిచేలా పనిచేస్తుందన్నారు. నగరంలో ఏర్పాటయ్యే ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలు పర్యావరణానికి అనుకూలమైన విధానాలను అమలు చేస్తాయి. అదే విధంగా రెండు విద్యుత్ వాహనాలతో నగరంలోని పాఠశాలలో విద్యార్థులను అవగాహన కల్పించేలా విద్య, కమ్యూనికేషన్ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఈ ప్రక్రియలో స్వచ్ఛంద సంస్థలు సైతం భాగస్వాములవుతాయన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని తగ్గించడం, ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం దీని ప్రధాన లక్ష్యమన్నారు. ఆస్పత్రులు, పాఠశాలలు, కార్యాలయాలు, షాపింగ్ మాల్స్, కార్పొరేట్ సంస్థలు, గ్యారేజీల నుంచి వ్యర్థాలను సేకరించి పునర్వినియోగం చేసేలా మార్పు చేస్తారు. ప్రజలు పునర్వినియోగ వస్తువులను అందించేందుకు ప్రత్యేకమైన వ్యవస్థలను ఏర్పాటు చేస్తామన్నారు.

SELECTION TEST
COACHING FOR IIT-JEE & NEET
CBSE : 19th March, 2025
ICSE/CBSE : 27th March, 2025
SSC/ICSE/CBSE : 3rd April, 2025
TEST CENTRES
ASCENT CLASSES
1. Besides K.A. Paul Auditorium CBM Compound/Asilmetta, Vsp.
2. Opp: NSTL Family Gate, NAD Jn., Vsp
3. Opp: Cricket Stadium, Opp: MVV City 3rd Gate, P.M. Palem, Vsp
Exam Timings: 10:00a.m. to 12:15p.m.
JYOTHI BALAVIHAR
STEEL PLANT
Sector-9, Ukkunagaram, Vizag.
Exam Timings: 2:30p.m. to 4:45p.m.
ascent CLASSES
Focussing on IIT-JEE & NEET
Besides K.A. Paul Auditorium
Asilmetta, Vsp. Ph: 0891- 2556015
97040 04847 / 99482 74565
79898 66197 / 83410 64067
10th Completed students can apply

క్లుప్తంగా

24న క్యాబ్ డ్రైవర్ల ధర్నా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

సీతమ్మధార: తమ సమస్యల పరిష్కారానికి ఈ నెల 24న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపడుతున్నట్టు క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు బి.జగన్, అధ్యక్షుడు సిహెచ్.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కె.పోలినాయుడు తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఓలా, ఉబర్, ర్యాపిడో డ్రైవర్లకు రాడార్ ట్రిప్పులు, ప్రీపెయిడ్ ఆప్షన్ తీసివేయాలని డిమాండ్ చేశారు. క్యాబ్ డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సామాజిక భద్రత చట్టం చేయాలన్నారు. డ్రైవర్లు, కష్టమర్లకు ఉపయోగపడేలా ఓలా, ఉబర్, ర్యాపిడో తరహాలో ప్రభుత్వం యాప్‌ను తీసుకురావాలని కోరారు. మోటార్ వెహికల్ చట్టం 2019, గ్రీన్ టాక్స్‌లను రద్దు చేయాలని, బీమా ప్రీమియం, టోల్‌గేట్ చార్జీలు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో క్యాబ్ డ్రైవర్లు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.5 వేలకు పెంచాలని పెన్షనర్ల ఆందోళన



ఆందోళనలో పాల్గొన్న ఈపీఎస్ 95 పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

సీతమ్మధార: కనీస పెన్షన్ రూ.5 వేలు అమలు చేయాలని ఈపీఎస్ 95 పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(బీఎంఎస్ అనుబంధం) రాష్ట్ర కన్వీనర్ ఐ.ముత్యాలు డిమాండ్ చేశారు. ఈపీఎస్ పెన్షన్‌కు డీఏ కలపాలని, ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా వైద్య సౌకర్యం అందించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ల ద్వారా ప్రధానికి వినతిపత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. 1995లో ఈపీఎఫ్ పెన్షన్ స్కీమ్‌ను సవరించి ఈపీఎస్ 95 పెన్షన్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత కనీస పెన్షన్ అమలు కాలేదని, తర్వాత భారతీయ మజ్దూర్ సంఘ్ కృషితో 2014 నుంచి కనీస పెన్షన్ రూ.1000కి పెంచారన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరల నేపథ్యంలో కనీస పింఛన్ రూ.5 వేలకు పెంచడంతో పాటు డీఏ జోడించి ఇవ్వాలని కోరారు. యూనియన్ నాయకులు, అధిక సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.

వేయి కనులు చాలవులే..

- ఉత్తరాంధ్ర తిరుపతిగా పేరుగాంచిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం
- నిత్యం శ్రీవారిని దర్శించుకుంటున్న వేలాది మంది భక్తులు
- రేపు ఆలయ తృతీయ వార్షికోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం



కోయిల్ ఆళ్వార్ తిరుమంజన సేవకు సుగంధ ద్రవ్యాలు, జలం తీసుకుని వెళ్తున్న అర్చకులు



సాగరతీరంలో.. ప్రకృతి ఒడిలో శ్రీవారి ఆలయం(ఇన్‌సెట్) స్వామి ఉత్సవమూర్తులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తోంది. సాగరానికి అభిముఖంగా ఎత్తైన కొండపై కొలువుదీరిన ఈ ఆలయం ఉత్తరాంధ్ర తిరుపతిగా పేరుగాంచింది. ఇక్కడికి వచ్చే భక్తులు ఏడుకొండల వెంకన్న స్వామిని దర్శించుకున్న అనుభూతిని పొందుతున్నారని చెబుతున్నారు. పచ్చని కొండలు, విశాలమైన సముద్ర తీరం మధ్య నెలకొని ఉన్న ఈ ఆలయం ఆహ్లాదకరమైన వాతావరణంలో అలరారుతోంది. యాంత్రిక జీవనంతో అలసిపోయిన వారికి ఈ ప్రదేశం ప్రశాంతతను, ఆధ్యాత్మిక చింతనను కలిగిస్తోంది. ఈ ఉత్తరాంధ్ర వైకుంఠధామంలో ఈ నెల 20న తృతీయ వార్షికోత్సవం నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

అణువణువునా అద్భుతమే..

శ్రీ వారి ఆలయం అణువణువునా ఓ అద్భుతమే. కనుచూపు మేర పరుచుకున్న ప్రకృతి అందాల మధ్య 10 ఎకరాల్లో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని టీటీడీ నిర్మించింది. 1.5 ఎకరాల్లో ప్రధాన ఆలయం ఉంటుంది. కొండపైకి రోడ్డుమార్గం సుందరంగా తీర్చిదిద్దారు. రోడ్డుకిరువైపులా పూల మొక్కలు, శ్రీ వారి నామాలతో అలంకరించిన పూల కుండీలు ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మిక శోభ, శిల్పకళా నైపుణ్యం ఉట్టిపడేలా నిర్మించిన ఈ శ్రీవారి ఆలయానికి దేశం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తున్నారు. కొండపైకి ఉచిత బస్సు సౌకర్యం కూడా కల్పించారు.

భక్తులకు సువర్ణావకాశం

శ్రీవారి ఆలయంలో ప్రతి నెలా శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం, ప్రతీ శుక్రవారం వారాభిషేకంలో భాగంగా శ్రీవారికి మేల్చాట్ వస్త్రం ధరింపజేస్తున్నారు. భక్తులు నేరుగా శ్రీవారికి మేల్చాట్ వస్త్రాన్ని అందించే అవకాశం ఉంది. ఈ వస్త్రం ధర రూ.30 వేల నుంచి రూ.80 వేల వరకు ఉంటుంది. ఏటా వైకుంఠ ఏకాదశి, ఉగాది, బ్రహ్మోత్సవాల ముందు మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తున్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయిస్తున్నారు. ప్రతి శనివారం కోలాటాలు, శ్రీవారి నామ సంకీర్తనలు, అన్నమాచార్య సంకీర్తనలు, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణాలు జరుగుతున్నాయి. టీటీడీ ఆధ్వర్యంలో నిత్యం అన్నప్రసాదాల పంపిణీ జరుగుతోంది. రాష్ట్రం నలుమూలల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో శ్రీవారి సేవకు వస్తున్నారు. శ్రీవారి ఆలయాన్ని చేరుకునేందుకు కొండపైకి ద్విచక్రవాహనాలు, కార్లు, బస్సులను మాత్రమే అనుమతిస్తున్నారు. ఆటోలకు అనుమతి లేదు. కొండ చిన్నది కావడంతో భక్తులు నడిచి ఆలయాన్ని చేరుకోవచ్చు. కొండపైకి ఉచిత బస్సు సౌకర్యం కూడా ఉంది. రాత్రి 7.45 గంటల వరకు మాత్రమే స్వామి దర్శనానికి భక్తులు అనుమతి కలదు.


వేడుకలు ఇలా..

ఈ నెల 20న శ్రీవారి ఆలయ తృతీయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. ఆ రోజు ఉదయం 5 గంటల నుంచి 5.30 గంటల వరకు సుప్రభాతం, 5.30 నుంచి 7 గంటల వరకు తోమాల సహస్ర నామార్చన, మొదటి గంట నిర్వహించి 7 నుంచి 12 గంటల వరకు భక్తులకు సర్వ దర్శనం కల్పించనున్నారు. ఆ రోజు ప్రత్యేకంగా భగవత్ అనుజ్ఞ, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, హోమం, ఉత్సవ మూర్తులకు అష్టోత్తర శత కలశ స్నపనం, పూర్ణాహుతి, అక్షతారోపణం నిర్వహించనున్నారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు మాఢ వీధుల్లో తిరుచ్చి ఉత్సవం, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏఈవో తెలిపారు.

శ్రీవారి సేవలివీ

సేవ వివరాలు	భక్తుల సంఖ్య	సమయం	టికెట్ ధర
సుప్రభాతం	1	ఉ. 6 గంటలు	100
పుష్పవిరాళం	4	ఉ. 8 గంటలు	12,000
తోమాల సేవ	1	ఉ. 8 గంటలు	200
సహస్ర నామార్చన	1	ఉ. 8.30 గంటలు	200
అర్చన	1	ఉ. 9.30 నుంచి సా.7.30 గంటలు	100
మేల్చాట్ వస్త్రం	4	ఉ. 6.30 గంటలు	30,150
అభిషేకం(శుక్ర)	1	ఉ. 6.30 గంటలు	250
ఏకాంత సేవ	1	రాత్రి 8 గంటలు	100
వేదాశీర్వాదం	4	ఉ. 10 నుంచి సా.6 గంటలు	1,500
భోగం విరాళం	4	-	10,000

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



శ్రీవారి ఆలయాన్ని శుద్ధి చేస్తున్న దృశ్యం

రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం(టీటీడీ)లో మంగళవారం ఆలయ శుద్ధి, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ నెల 20న నిర్వహించనున్న శ్రీవారి ఆలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా టీటీడీ సంప్రదాయం ప్రకారం ముందుగా వచ్చే మంగళవారం ఈ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సుగంధ ద్రవ్యాలతో శ్రీవారి ఆలయం, హనుమాన్, మహాలక్ష్మి, గోదాదేవి ఆలయాలను శుద్ధి చేశారు. మధ్యాహ్నం నుంచి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఏఈవో జగన్మోహనాచార్యులు, ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఆలయ అర్చకులు, పండితులు పాల్గొన్నారు.

వైద్య విద్య ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు అన్యాయం

ప్రజా ఆరోగ్య వేదిక

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం పేరిట వైద్య విద్య, వైద్య కళాశాలల ప్రైవేటీకరణను తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రజా ఆరోగ్య వేదిక డిమాండ్ చేసింది. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో వివిధ సంస్థల ప్రతినిధులతో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రా మెడికల్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ వైద్య విద్యను ప్రైవేటీకరించడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వమే వైద్య కళాశాలలను నిర్వహించాలని కోరారు. విశ్రాంత డీఎంహెచ్‌వో డాక్టర్ పి.రామారావు మాట్లాడుతూ పీపీపీ విధానం వల్ల వైద్య ఖర్చులు విపరీతంగా పెరుగుతాయని, పేదలకు వైద్యం అందడం కష్టతరమవుతుందన్నారు. ఇప్పటికే ఆరోగ్య రంగంలో ఖర్చులు భరించలేని స్థాయిలో ఉన్నాయన్నారు. ప్రైవేటీకరణతో ఈ పరిస్థితి మరింత దిగజారుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.మురళీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య రంగమనేది ప్రజల ప్రాథమిక హక్కని, దీనిని ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం వల్ల ప్రజల హక్కులు కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు. మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ నిహాల్ మాట్లాడుతూ మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న ఈ సమయంలో ప్రభుత్వం వైద్య సేవలను విస్తరించాలని, ప్రైవేటీకరణ వల్ల మానసిక ఆరోగ్య సేవలు కూడా ఖరీదైనవిగా మారుతాయన్నారు. ప్రజారోగ్య వేదిక ప్రతినిధి టి.కామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీపుల్స్ ఫర్ ఇండియా ప్రతినిధి బి.ఎల్.నారాయణ, మెడికల్ విద్యార్థిని డాక్టర్ జ్యోత్స్న, కె. సంతోష్‌కుమార్, జి.వి.రమణ, ఎం.సుబ్బారావు, కర్రి చంద్రశేఖర్, తేజ, ఐలా, డాక్టర్ జానకీరామ్, శేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూడు కేసుల్లో 23.4 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ నుంచి అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న నిందితులను మంగళవారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశాఖ గవర్నమెంట్ రైల్వే పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ, జీఆర్పీ ఎస్‌ఐలు తమ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లో పలు ప్లాట్‌ఫాంల్లో తనిఖీలు నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన దేవరశెట్టి కళ్యాణ్, బోర ప్రసాద్ విశాఖపట్నం మీదుగా గంజాయి రవాణా చేయడం గుర్తించారు. వారి వద్ద నుంచి సుమారు 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను జీఆర్పీ ఎస్ఐ కె.శాంతారంకి అప్పగించారు. మరో కేసులో బోలంగీర్ జిల్లా ఒడిశా రాష్ట్రానికి చెందిన దిలీప్ బాగ్, బీరేంద్ర రానాలు విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా ముంబయికి గంజాయి రవాణా చేయడం గుర్తించారు. వారి వద్ద నుంచి 13 కేజీల గంగజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను జీఆర్పీ ఎస్ఐ అబ్దుల్ మారూఫ్‌కు అప్పగించారు. మరో కేసులో గుంటూరు జిల్లాకు చెందిన జొన్నల నాగ సతీష్‌రెడ్డి వద్ద నుంచి 5.4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముద్దాయిని జీఆర్పీ ఎస్ఐ ఎస్.రామారావుకు అప్పగించారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

ఆదివాసీలపై దమనకాండను ఆపాలి

సామాజిక వేత్త ఆచార్య హరగోపాల్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

సీతంపేట: దేశంలో అభివృద్ధి నమూనా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని ప్రముఖ సామాజిక వేత్త, ఆచార్య జి.హరగోపాల్ అన్నారు. 'ఆపరేషన్ కగార్' పేరుతో ఆదివాసీలపై జరుగుతున్న దమనకాండను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మంగళవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ సంపద కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమవుతోందని, అభివృద్ధిలో సమానత్వం లేదన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో అభివృద్ధి పేరుతో అణచివేత జరుగుతోందని ఆరోపించారు. ఎవరు వ్యతిరేకించినా రాష్ట్రంలో ఖనిజాల తవ్వకాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తామని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి ప్రకటించారని.. బస్తర్ ప్రాంతంలో పోలీస్ క్యాంపుల వెనుక అక్కడి ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే కుట్ర ఉందన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో కొన్ని ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, ఆ మేరకు ఆదివాసీల వ్యతిరేకతతో వేదాంత కంపెనీ వెనక్కి వెళ్లిపోయిందని గుర్తు చేశారు. మావోయిస్టుల ఏరివేత వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడమేనన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు వి.ఎస్.కృష్ణ మాట్లాడుతూ మావోయిస్టు ఉద్యమాన్ని రాజకీయంగా పరిష్కరించే దృష్టి ప్రభుత్వాలకు లేదన్నారు. ప్రజల హక్కులకు లోబడి మావోయిస్టులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని, దీనికి విరుద్ధంగా బూటకపు ఎన్‌కౌంటర్లు, గ్రామాలను ధ్వంసం చేయడం, లైంగిక దాడులు, వ్యక్తుల అదృశ్యం వంటి చర్యలకు పాల్పడుతూ ఉద్యమాన్ని క్రిమినలైజ్ చేశారని విమర్శించారు. హక్కుల సంఘాల పోరాటంతో 2011లో కోర్టు సల్వాజుడుం రాజ్యాంగ విరుద్ధమని ఇచ్చిన తీర్పుతో దానిని రద్దు చేశారన్నారు. ఆ తర్వాత గ్రీన్‌హంట్, ప్రస్తుతం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా, పెద్ద ఎత్తున రహదారులు నిర్మిస్తూ వనరుల దోపిడీకి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సదస్సులో పర్యావరణవేత్త గంజివరపు శ్రీనివాస్, ఆదివాసీ హక్కుల నేత రామారావు దొర, మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, న్యాయవాది వృద్ధుల కల్యాణ రామా రావు, వామపక్ష నేతలు ఎం.పైడిరాజు, వై.కొండయ్య, డి.లలిత, ఎ.విమల, పద్మ, ఎం.లక్ష్మి, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, **KRRISH LOHIA** son of MANISH LOHIA previously called as **KRISH LOHIA**, Residing of 30-8-22, Flat no - 302, Bhanu street, Srinivasa enclave, Dabagardens, Visakhapatnam - 530020 now changed my name from **KRISH LOHIA** (Old name) to **KRRISH LOHIA** (new name) henceforth I will be called as **KRRISH LOHIA** for all purpose

LOSS OF DOCUMENT

I, **ALLU SANKARA RAO** S/o. Late Jagannadham, Residing at D.No. 21-52/7/43, Flat No. 401, KSB Pearl-2, Viman Nagar, NAD Kotha Road, Visakhapatnam - 530009. A.P. Have lost My Sister Lalam Tiruputamma Original Document No. 1641/2003. while I was Travelling from Vimanm Nagar to NAD. If anybody find it please Contact - 94413 45745

Real Estate

PLOT FOR SALE

■ అతి తక్కువ ధరలలో South Coast రైల్వే జోన్ పరిధి కొత్తవలస దగ్గర ఇంటిస్థలం వెంటనే రిజిస్ట్రేషన్ చేయబడును. ఫోన్: 70130 04270, 93969 72239. [V-2120]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి ఆదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర: 98484 88068/ 77992 23300 [V- 13197]

Wanted

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 8977639663, 8977639662 [SCA25002130]

Services

BUSINESS OFFERS

■ హోమ్ లోన్ 48 గంటల్లో పొందండి ! ITR / సాలరీ స్లిప్స్ లేదా? ఎటువంటి సమస్య లేదు! Home First - 74063 93937 [HA-438]

రియల్టీ సమాచారం కొరకు లాగాన్ కండి www.sakshi.com

సాక్షి క్లాసిఫైడ్స్

లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా + అల్లూరి జిల్లా : నాలుగు లైన్లు రూ. 475/- అదనపు లైను రూ. 100/- + 5% జి.ఎస్.టి. అదనం.

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:

మురళీనగర్, మాధవధార	90101 33346
NAD, కంచరపాలెం	90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ, MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	97059 33394

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గాయపరిచిన వ్యక్తికి జైలు

విశాఖ లీగల్: ఒక వ్యక్తిని గాయపరిచిన యువకునికి రెండేళ్ల జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ నగరంలో రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి గాయత్రి మంగళవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని స్పష్టం చేశారు. ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బాధితుడు వండ్రంగి రాము గోపాలపట్నం పోలీసు స్టేషన్ పరిధిలో రామకృష్ణానగర్‌లో నివాసం ఉంటున్నాడు. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. 2017 డిసెంబర్ 24వ తేదీన ఫిర్యాది రాము తన ఇంటి సమీపంలోని నరసింహా థియేటర్ పక్కన సందులో గొడ్డలితో కర్రలు కొట్టుకుంటూ ఉన్నాడు. సాయంత్రం 4.30 గంటల సమయంలో నిందితుడు బోను శ్రీను, వీరబాబు రాము దగ్గరకు వచ్చి ఘర్షణ పడ్డారు. ఈ సమయంలో ఇద్దరు పూటుగా మద్యం సేవించి ఉన్నారు. శ్రీను, వీరబాబు కలిసి రాముపై దాడి చేశారు. వీరబాబు దగ్గర ఉన్న ఇనుప రాడ్డుతో రామును తీవ్రంగా గాయపరిచారు. వీరిపై గోపాలపట్నం పోలీసులు కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు. ఈ కేసు విచారణలో ఉండగా వీరబాబు మృతి చెందారు.

నెట్స్‌లో శ్రమించిన ఢిల్లీ క్యాపిటల్స్

విశాఖ స్పోర్ట్స్: వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్(డీసీ) జట్టు మంగళవారం ప్రాక్టీస్ ప్రారంభించింది. తొలి మ్యాచ్ ఈ నెల 24న జరగనున్న నేపథ్యంలో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో కోచ్‌లు హేమంగ్, మాథ్యూ, మునాఫ్ పటేల్ ఆధ్వర్యంలో ఫిట్‌నెస్, బ్యాటింగ్, బౌలింగ్‌లో ఆటగాళ్లు శ్రమించారు. ప్రాక్టీస్ రాత్రి 8 గంటల వరకు కొనసాగింది. కాగా.. డీసీ కెప్టెన్ అక్షర్ ఈ నెల 20న ముంబయిలో జరిగే బీసీసీఐ సమావేశానికి హాజరుకానున్నాడు. 18వ ఐపీఎల్ సీజన్ ఈ నెల 22న ఈడెన్ గార్డెన్స్‌లో ప్రారంభం కానుంది.

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడి అరెస్ట్

బీచ్‌రోడ్డు: ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఒకరిని ఎంవీపీకాలనీ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలివి. మద్దిలపాలెంలోని వి.ఎస్.కృష్ణా కళాశాల సమీపంలో సోమవారం సాయంత్రం బర్రి శ్రీను అనే వ్యక్తి కారులో కూర్చొని ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. ఈ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, ఎంవీపీ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో exchange666.com యాప్ ద్వారా బెట్టింగ్ ఆడిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి మూడు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు ఖాతాలోని రూ.14,75,530 ఫ్రీజ్ చేశారు.

గంగమ్మతల్లీ నీదే భారం



మత్స్యకారుల జీవితం సముద్రంతో ముడిపడి ఉంటుంది. వీరి జీవనం మొత్తం సముద్రంపైనే ఆధారపడుతుంది. వీరు గంగమ్మ తల్లిని దైవంగా పూజిస్తారు. కొత్త పడవని కొనుక్కున్న ఓ మత్స్యకారుడు తీరంలో కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. సముద్రంలో దండిగా చేపలు లభించాలని, కుటుంబం సంతోషంగా ఉండాలని ప్రార్థించారు.

పొగబండి.. సంద్రంలో సాగునండి



సముద్రంపై వెళ్లే నౌకల్లో పొగ రావడం అరుదు. పొగబండి అంటే గతంలో బొగ్గుతో నడిచే రైలింజన్ మాత్రమే గుర్తుకొస్తుంది. ఇది మాత్రం సముద్రంలో అలలపై నడిచే పొగబండి. ఈ భారీ నౌక విశాఖ తీరంలో కనువిందు చేసింది. నౌకలకు అవసరమైన చమురు, నీరు, ఇతర వస్తువులను తరలించేందుకు ఉపయోగించే నౌకగా దీని గురించి చెప్తున్నారు. సాధారణ నౌకలకు భిన్నంగా కనిపించడంతో నగరవాసులు ఆసక్తిగా తిలకించారు.

కైలాసగిరిపై భద్రత ప్రశ్నార్థకం

- పట్టాలు తప్పిన సర్క్యూట్ ట్రైన్
- ఇటీవలే రోప్‌వే వద్ద అగ్ని ప్రమాదం
- వరుస ప్రమాదాలతో పర్యాటకుల్లో ఆందోళన



పట్టాలు తప్పి దూసుకుపోవడంతో పాడైన ట్రాక్, రోడ్డు



కైలాసగిరిపై పట్టాలు తప్పి నిలిచిపోయిన విశాఖ దర్శిన్ టాయ్ ట్రైన్

ఆరిలోవ: నగరంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కైలాసగిరిలో పర్యాటకుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. కొద్ది రోజుల వ్యవధిలోనే వరుస ప్రమాదాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. నగరానికి వచ్చే విదేశీ పర్యాటకులను సైతం విశేషంగా ఆకర్షించే కై లాసగిరిపై నిర్వహిస్తున్న సర్క్యూట్ ట్రైన్(విశాఖ దర్శిని టాయ్ ట్రైన్) సోమవారం పట్టాలు తప్పింది. సందర్శకులను తీసుకువెళుతుండగా తెలుగు మ్యూజియం ఎదురుగా ఈ ఘటన జరిగింది. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ట్రైన్ సుమారు 200 మీటర్ల దూరం ట్రాక్‌పై దూసుకుపోవడంతో ట్రాక్, ఇరువైపులా రోడ్డు కొంత మేర దెబ్బతిన్నాయి. వారం రోజుల కిందట కై లాసగిరిలోని రోప్‌వే వద్ద అగ్నిప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. ఇప్పుడు సర్క్యూట్ ట్రైన్ పట్టాలు తప్పడంతో వీఎంఆర్డీఏ అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సరైన నిర్వహణ లేకపోవడం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని సందర్శకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ట్రైన్ మొరాయించడం కొత్తేమీ కాదు. గతంలోనూ అనేకసార్లు సాంకేతిక సమస్యలతో నిలిచిపోయింది. నెల రోజుల కిందటే మరమ్మతులకు గురి కాగా ఈ ట్రైన్‌ను నడపకుండా వీఎంఆర్డీఏ అధికారులు నిలిపివేశారు. దీని ఇంజిన్‌లో కొన్ని భాగాలు పాడవడం, జనరేటర్ పనిచేయకపోవడం, ఏసీ, ఫ్యాన్లు పాడవడంతో మరమ్మతులు చేస్తామంటూ కై లాసగిరి స్టేషన్‌లో ఓ బోర్డు ఏర్పాటు చేశారు. నిలిపివేసిన మూడు వారాల తర్వాత మళ్లీ ట్రైన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మళ్లీ అదే పరిస్థితి తలెత్తడం గమనార్హం. సేవలు ప్రారంభించిన వారం రోజులకే ట్రైన్ పట్టాలు తప్పడం ఆందోళన కలిగిస్తోంది. ట్రైన్‌లో మరమ్మతులు పూర్తి కాకుండానే తిప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ట్రైన్ చక్రాలు పూర్తిగా అరిగిపోయాయని, సరైన నిర్వహణ లేకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందని తెలుస్తోంది. అధికారులు మాత్రం తమ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరమ్మతులు చేస్తున్నట్లుగా పాత బోర్డునే మళ్లీ ఏర్పాటు చేసి పర్యాటకులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శిస్తున్నారు. నగరంలో ఇంతటి ప్రాముఖ్యత కలిగిన పర్యాటక ప్రాంతం పట్ల అధికారులు చూపుతున్న నిర్లక్ష్యంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. వీఎంఆర్డీఏ తక్షణమే స్పందించి కైలాసగిరిలోని పర్యాటక సౌకర్యాల నిర్వహణపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



రైల్వే క్రాసింగ్ వద్ద ప్రత్యేకమైన భద్రతా వ్యవస్థ ఉంటుంది. రైలు వచ్చే సమయంలో గేటు వేసి ప్రజలు, వాహనాల రాకపోకలను నిత్యం నియంత్రిస్తారు. రైలు వచ్చే సమయంలో రైలు పట్టాలపైకి

జర భద్రం

వెళ్లడం ప్రాణాలతో చెలగాటం ఆడటమే. రామ్మూర్తి పంతులుపేట వద్ద ఉన్న రైల్వే క్రాసింగ్ వద్ద రైలు వచ్చే సమయంలో గేటు వేసి ఉన్నప్పటికీ కొంతమంది వాహనదారులు తమ వాహనాలను కింద నుంచి వంచి దాటుతున్నారు. మరికొంతమంది గేటు వేసి ఉన్నా ఫోన్‌లో మాట్లాడుకుంటూ నడుచుకుంటూ వెళ్తున్నారు. ఇటువంటి ప్రమాదకర విన్యాసాలు అవసరమా.. జరభద్రంగా ఉండరాదూ..

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం